సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ

సోమవారం । 18 । సెప్టెంబర్ । 2023



రూ.80 వేల విరాళం

మామిడికుదురు: అప్పనపల్లి శ్రీ బాలబాలాజీ స్వామి నిత్యాన్నదానం ట్రస్టుకు సుందరపల్లి వెంకట్రావు, తులసి దంపతులు, కుటుంబ సభ్యులు (కాకినాడ) ఆదివారం రూ.80 వేల విరాళం సమర్పించారు.



లోవ దేవస్థానానికి రూ.లక్ష..

తుని రూరల్: తలుపులమ్మ అమ్మవారి లోవ దేవస్థానంలో మహామండపం నిర్మాణానికి విన్నకోట లక్ష్మీ కరుణలత, కుటుంబ సభ్యులు (విజయనగరం) ఆదివారం రూ.లక్ష విరాళం సమర్పించారు.

మిగులు జలాల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి ఆదివారం 4,31,844 క్యూసెక్కుల గోదావరి మిగులు జలాలను సముద్రంలోకి విడిచిపెట్టారు. తూర్పు డెల్టాకు 4,800, మధ్య డెల్టాకు 2,400, పశ్చిమ డెల్టాకు 7 వేల క్యూసెక్కుల నీరు వదిలారు. భద్రాచలం వద్ద 29.40, కాటన్ బ్యారేజీ వద్ద 9.50 అడుగులకు నీటిమట్టం చేరింది.

న్యూస్‌రీల్

మూడు నియోజకవర్గాలకు రూ.33.60 కోట్లు

- 147 గ్రామ,వార్డు సచివాలయాలకు అదనంగా సమకూరనున్న సదుపాయాలు
- మంత్రి విశ్వరూప్



అమలాపురం రూరల్: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి 147 గ్రామ, వార్డు సచివాలయాలకు అదనంగా మరో రూ.16.80 లక్షల చొప్పున రూ.33.60 కోట్లు మంజూరు చేసినట్లు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అదివారం తెలిపారు. అమలాపురంలో ఆగస్టు 11వ తేదీన డ్వాక్రా సంఘాలకు సున్నా వడ్డీ రాయితీ నిధులకు జమ చేసేందుకు విచ్చేసిన సందర్భంగా సీఎం జగన్‌కు తాను చేసిన అభ్యర్థన మేరకు ఈ హై ఇంపాక్ట్ నిధులు మంజూరయ్యాయన్నారు. గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమానికి సంబంధించి గ్రామ వార్డు సచివాలయాల పరిధిలో అభివృద్ధి కార్యక్రమాల కోసం తన అభ్యర్థన మేరకు సీఎం స్పందించి ముమ్మిడివరం, రామచంద్రపురం, అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 147 గ్రామ, వార్డు సచివాలయాలకు ప్రస్తుతం కేటాయించిన హై ఇంపాక్ట్ నిధులకు అదనంగా ఇవి విడుదల చేశారన్నారు. ఈ నిధులతో ఆయా గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో రోడ్లు, డ్రైన్లు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించడం ద్వారా ప్రజలకు ఎంతో ప్రయోజనం చేకూరడంతో పాటుగా వాటి ముఖచిత్రాలు పూర్తిగా మారనున్నాయని మంత్రి విశ్వరూప్ పేర్కొన్నారు. ఈ మేరకు ఈ నెల 11వ తేదీన రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఈ అదనపు నిధులు ముమ్మిడివరం అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ఏడు నగర పంచాయతీల వార్డు సచివాలయాలకు, రామచంద్రపురం అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో కె.గంగవరం మండలంలో 23 గ్రామ సచివాలయాలకు, రామచంద్రపురం మండలం పరిధిలో 21గ్రామ సచివాలయాలకు, రామచంద్రపురం అర్బన్ పరిధిలో 12 వార్డు సచివాలయాలకు, అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ఉప్పలగుప్తం మండలంలో 17 గ్రామ సచివాలయాలకు, అల్లవరం మండలంలో 23 గ్రామ సచివాలయాలకు, అమలాపురం మండలంలో 29 గ్రామ సచివాలయాలకు, అమలాపురం అర్బన్‌లో 15 వార్డు సచివాలయాలకు మొత్తం 147 సచివాలయాలకు నిధులు మంజూరైనట్లు మంత్రి విశ్వరూప్ తెలిపారు.

కుండలేశ్వరుని తాకిన సూర్య కిరణాలు



కుండలేశ్వరస్వామి ఆలయంలో మూలవిరాట్‌ను తాకిన సూర్య కిరణాలు

కాట్రేనికోన: కుండలేశ్వరంలో వేంచేసి ఉన్న పార్వతీ సమేత కుండలేశ్వరస్వామి మూల విరాట్‌ను ఆదివారం సూర్య కిర ణాలు తాకాయని ఆలయ అర్చకుడు కాళ్ళకూరి కామేశ్వరరావు శర్మ తెలిపారు. సూర్య కిరణాలు కుండలేశ్వరస్వామి మూల విరాట్‌ను తాకడంతో భక్తులు భక్తి శ్రద్ధలతో దర్శించుకున్నారు. సూర్య కిరణాలు స్వామిని తాకడం కుండలేశ్వరస్వామికి అరుదు కావడంతో ఆసక్తితో భక్తులు స్వామిని దర్శించుకున్నారు.

ప్యాకేజీ స్టార్‌ను ప్రజలు నమ్మరు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): చంద్రబాబు దత్తపుత్రుడు, ప్యాకేజీ స్టార్ పవన్ పవన్ కల్యాణ్‌ను నమ్మే స్థితిలో రాష్ట్ర ప్రజలు లేరని రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్య శంకర్ నాయక్ అన్నారు. కాకినాడ జిల్లాలోని గిరిజన గ్రామాల్లో రెండు రోజులు పర్యటించిన ఆయన.. ఆదివారం కాకినాడలోని అతిథి గృహంలో విలేకర్లతో మాట్లాడారు. అవినీతి వల్లే చంద్రబాబుపై కేసు పెట్టారని చెప్పారు. ఆయనకు రిమాండ్ విధిస్తూ తీర్పు ఇచ్చిన న్యాయమూర్తిని సోషల్ మీడియాలో దూషించడం సరికాదని అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గిరిపుత్రుల విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని, గిరిజనులపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తూ, అన్ని విధాలా సహకరిస్తున్నారని చెప్పారు. గిరిజనుల పక్షపాతిగా, తండ్రిని మించిన తనయుడిగా మంచి పాలన అందిస్తున్నారని కొనియాడారు.

ఎస్పీతో భేటీ

కాగా, శంకర్ నాయక్ జిల్లా ఎస్పీ ఎస్.సతీష్ కుమార్‌ను ఆయన చాంబర్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. గిరిజన ప్రాంతానికి సంబంధించిన అంశాలు, అక్కడి శాంతిభద్రతల పరిస్థితిపై చర్చించారు. అనంతరం పోలీసు శిక్షణ అందిస్తున్న శ్యామ్ ఇన్‌స్టిట్యూట్‌ను సందర్శించి, విద్యార్థులతో ఇంటరాక్ట్ అయ్యారు. ఆయన వెంట జిల్లా గిరిజన సంక్షేమ అధికారి విజయశాంతి, జేఎన్‌టీయూకే ఫుడ్ టెక్నాలజీ విభాగాధిపతి డాక్టర్ మాలోతు రమేష్ ఉన్నారు.

ఘనపయ్యేకు మెరుగులు

- ఖైరతాబాద్ విగ్రహానికి 18 ఏళ్లుగా రంగులు వేస్తున్న గొల్లపాలెం కళాకారులు



అమలాపురం షరాబుల వినాయక చవితి చలువ పందిరికి ఓ వైపు వెంకటేశ్వరస్వామి ఆలయాన్ని తలపించేలా భారీ సెట్టింగ్

కాజులూరు: దేశంలో వినాయక ఉత్సవాల నిర్వహణలో తెలుగు వారికి ప్రత్యేక స్థానం ఉంది. అందులో తెలంగాణలోని ఖైరతాబాద్‌లో ఏ ఏడాదికా ఏడాది వినూత్న రీతిలో భారీ విగ్రహాలను ప్రతిష్ఠిస్తూ హైదరాబాదీలు ప్రాధాన్యం చాటుకుంటారు. అయితే ప్రాముఖ్యత చెందిన ఈ విగ్రహాలకు ప్రతీ ఏటా రంగులు వేసి సుందరంగా తీర్చిదిద్దేది కాజులూరు మండలం గొల్లపాలెంకు చెందిన 'సత్య ఆర్ట్స్' సభ్యులు. వీరు గత 18 సంవత్సరాలుగా ఖైరతాబాద్ వినాయకుడుకి రంగులు వేసే పని నిర్వహిస్తున్నారు. గతంలో గ్రామానికి చెందిన గీసాల వీరవెంకటసత్యనారాయణ (సత్య) తన మిత్రబృందంతో కలసి ఏటా ఖైరతాబాద్ వినాయకుడుకి రంగులు వేసేందుకు హైదరాబాద్ వెళ్లేవారు. కొన్నాళ్ల క్రితం రోడ్డు ప్రమాదంలో సత్య మృతి చెందగా ఆయన సోదరుడు భీమేశ్వరరావు (భీమేష్) ఆ బాధ్యత తీసుకున్నారు. ఈ ఏడాది ఖైరతాబాద్‌లో నిర్వాహక కమిటీ 63 అడుగుల ఎత్తున శ్రీ దశమహ విద్యాగణపతి అవతారంలో స్వామివారి విగ్రహాన్ని ఏర్పాటు చేసింది. మంటపంలో సరస్వతీదేవి, వరాహాదేవి విగ్రహాలతోపాటు ఇరువైపులా ఒక పక్క శ్రీ పంచముఖ లక్ష్మీనరసింహస్వామి, **మరోపక్క వీరభద్రస్వామి విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఈ విగ్రహాలకు గొల్లపాలెం నుంచి వెళ్లిన సత్య ఆర్ట్స్ బృందం 20 మంది గత వారం రోజులుగా శ్రమించి రంగులు దిద్దే పని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివారం గ్రామానికి తిరిగివచ్చిన 'సత్య ఆర్ట్స్' సభ్యులు 'సాక్షి'తో మాట్లాడుతూ** లాభనష్టాల మాట ఎలా ఉన్నా ఉభయ తెలుగు రాష్ట్రాలలో ప్రత్యేకత సాధించిన ఖైరాతాబాద్ వినాయకుని విగ్రహానికి తాము రంగులు వెయ్యటం ఎంతో సంతృప్తికరంగా ఉందన్నారు. సత్య సోదరుడు భీమేష్ మాట్లాడుతూ తన అన్న చేపట్టిన పనిని తాను ఏటా కొనసాగించదలచానన్నారు.

చవితి సెట్టింగ్‌లు సూపర్ హిట్!

అమలాపురం టౌన్: వినాయక చవితి ఉత్సవాల నిర్వహణకు స్థానిక బులియన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ముమ్మిడివరం గేటు సెంటరు సమీపంలో రోడ్డుపై చలువ పందిరి భారీ సెట్టింగ్‌లతో నిర్మితమైంది. పందిరికి రెండు వైపులా ముఖ ద్వారాలపై ప్రముఖ ఆలయాలను తలపించేలా సెట్టింగ్‌లు వేశారు. ఓ వైపు దాదాపు 35 అడుగుల ఎత్తుతో వెంకటేశ్వర ఆలయాన్ని తలపించేలా చక్కటి నైపుణ్యంతో సెట్టింగ్ రూపొందించారు. మరోవైపు అయ్యప్ప ప్రతిమ, ఆలయాన్ని తలపించే సెట్టింగ్ నెలకొల్పారు. పందిరిలోకి అడుగు పెట్టగానే ఓ ఆలయంలోకి వెళ్లిన భావన కలిగించేలా వీటిని రూ.లక్షల వ్యయంతో నిర్మించారు. దీనిని చలువ పందిరి అనే కంటే ఓ అందమైన భారీ సెట్టింగ్ అంటేనే బాగుంటుంది. ఇది భక్తులను విశేషంగా ఆకట్టుకుంటోంది. రోడ్డున పోయే జనం ఆగి మరీ తమ సెల్‌ఫోన్లలో ఫొటోలు తీసుకుంటున్నారు. రాత్రి సమయాల్లో మరింత దేదీప్యమానంగా వెలుగొందేలా విద్యుత్ దీపాలను భారీగా అలంకరించారు. తాళ్లరేవు మండలం సుంకరపాలెం జంక్షన్‌లో వేసిన సెట్టింగ్ చూపరులను విశేషంగా ఆకట్టుకుంది.



ఖైరతాబాద్‌లో ఈ ఏడాది ఏర్పాటు చేసిన భారీ గణనాథుని విగ్రహానికి తుది మెరుగులు దిద్దుతున్న భీమేష్



వినాయక చవితి పూజా సామగ్రి దుకాణాలతో రద్దీగా ఉన్న అమలాపురం గడియారం స్తంభం సెంటరు

మార్కెట్ కళకళ

వినాయక చవితి సందర్భంగా అమలాపురం మార్కెట్ ఆదివారం రద్దీగా కనిపించింది. ఆర్టీసీ బస్‌స్టేషన్ రోడ్డు నుంచి మెయిన్‌రోడ్డు, గడియారం స్తంభం, హైస్కూలు, ముమ్మిడివరం గేటు సెంటర్ల మీదుగా ఉన్న ప్రధాన రోడ్ల చెంత వందలాది చవితి పూజా సామగ్రి దుకాణాలు వెలిశాయి. వీటికి తోడు పూల దుకాణాలు, స్వీటు దుకాణాల్లో కూడా పండగ అమ్మకాలు ఊపందుకున్నాయి. వినాయక ప్రతిమ దుకాణాలు అనేకం వెలిశాయి. కిలో నుంచి పది కిలోల బరువు ఉన్న గణపతి మహా లడ్డూలను తయారుచేసి అమ్మకాలకు స్వీటు దుకాణాల్లో ప్రదర్శనగా ఉంచారు. పూల అమ్మకాలు కూడా జోరుగా సాగాయి.



తాళ్లరేవు మండలం సుంకరపాలెం జంక్షన్‌లో వేసిన సెట్టింగ్

కోడై కూస్తున్న ధర!

- కిలో చికెన్ రూ.320 పలుకుతున్న వైనం
- పెరిగిన కోడిపిల్ల రేట్లు
- స్థానికంగా తగ్గిన బ్రాయిలర్ కోళ్ల పెంపకం
- ఛత్తీస్‌గఢ్, తెలంగాణ ప్రాంతాల నుంచి దిగుమతి
- శ్రావణంలోనూ దిగిరాని ధర



బ్రాయిలర్ కోళ్లు

మండపేట : మాంసాహార ప్రియులు అధికంగా ఇష్టపడే చికెన్ ధర చుక్కలు చూపిస్తోంది. రిటైల్ దుకాణాల వద్ద రూ.320 పలుకుతూ వినియోగదారులను బెంబేలెత్తిస్తోంది. కోడిపిల్లల ధరలు అమాంతం పెరిగిపోవడంతో కొత్తబ్యాచ్‌లు వేసేందుకు కోళ్ల రైతులు విముఖత చూపుతున్నారు. స్థానికంగా లభ్యత తగ్గడంతో ఛత్తీస్‌గఢ్, తెలంగాణ ప్రాంతాల నుంచి కోళ్లను దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది.

రోజుకు 3.2 లక్షల కిలోల చికెన్ వినియోగం

తూర్పుగోదావరి, కోనసీమ, కాకినాడ జిల్లాల్లో రోజుకు సుమారు 3.2 లక్షల కిలోల చికెన్ వినియోగిస్తుండగా, ఆదివారం, పండగ రోజుల్లో రెట్టింపు స్థాయిలో అమ్మకాలుంటాయి. ఆలమూరు, రాజానగరం, కోరుకొండ, గోకవరం, అమలాపురం, రావులపాలెం, తుని, తొండంగి, కొవ్వూరు తదితర ప్రాంతాల్లో 440 ఫామ్‌ల వరకు విస్తరించి ఉండగా ఏడు లక్షల కోళ్ల పెంపకం జరుగుతున్నట్టు అంచనా. బ్యాచ్ వేసిన 40 రోజుల్లో రెండు నుంచి రెండున్నర కేజీల వరకు పెరిగి బ్రాయిలర్ కోళ్లు వినియోగానికి వస్తాయి. పండగలు, పెళ్లిళ్ల సీజన్‌ను బట్టి రైతులు ఎప్పటికప్పుడు కొత్త బ్యాచ్‌లు వేస్తుంటారు. మిగిలిన నెలలతో పోలిస్తే శ్రావణమాసం, వినాయక చవితి వేడుకలు, అయ్యప్ప దీక్షలు, కార్తికమాసంలో చికెన్ వినియోగం తగ్గుతుంది. ఈ నేపథ్యంలో ఆయా పండగల సమయాల్లో కొత్త బ్యాచ్‌లు వేయడాన్ని కొంతమేర తగ్గిస్తుంటారు.

రూ.12 నుంచి రూ.50కు పెరిగిన కోడిపిల్ల ధర

నెలన్నర రోజుల క్రితం రూ.12 ఉన్న కోడిపిల్ల ధర ప్రస్తుతం రూ.50కి చేరుకుంది. శ్రావణమాసంలో వినియోగం తగ్గుతుందని పలు హేచరీల్లోని బాయిలర్ కోళ్ల గుడ్లు ఉత్పత్తికి వినియోగించే పేరెంట్స్ కోళ్ల (బొంత కోళ్ల)ను షాపులకు అమ్మేశారు. గుడ్ల కొరతతో హేచరీల్లో కోడి పిల్లల ఉత్పత్తి తగ్గి వాటి ధర అమాంతం పెరిగిపోయిందని కోళ్ల రైతులు అంటున్నారు. మరోపక్క కోడి మేత ధరలు, ఇతర నిర్వహణ వ్యయం పెరిగిపోవడంతో గిట్టుబాటు కాదని అధిక శాతం మంది రైతులు కొత్త బ్యాచ్‌లు వేయలేదు. స్థానికంగా లభ్యత తగ్గడంతో తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి కోళ్లను దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది. ఆయా కారణాలతో శ్రావణమాసంలో వినియోగం తగ్గినా ధర దిగి రాలేదంటున్నారు. శ్రావణమాసం మొదట్లో రూ.250 ఉన్న కిలో స్కిన్ లెస్ చికెన్ ధర, నెలాఖరు నాటికి రూ.350కు చేరింది. వినాయక చవితి నవరాత్ర ఉత్సవాల నేపథ్యంలో వినియోగం మరింత తగ్గనుండటంతో అక్కడక్కడా పౌల్ట్రీల్లో ఉన్న కోళ్లను మార్కెట్‌లోకి తెస్తున్నారు. ఫలితంగా నాలుగు రోజులుగా ధర స్వల్పంగా తగ్గుతూ వచ్చింది. రిటైల్ దుకాణాల వద్ద స్కిన్‌లెస్ కిలో రూ.320, లైవ్ రూ.145 వరకు అమ్ముతున్నారు.

కోడిపిల్ల ధర బాగా పెరిగిపోయింది

కోడిపిల్ల ధర నెలన్నర రోజుల్లో రూ.12 నుంచి రూ.50కు పెరిగిపోయింది. ఆన్ సీజన్, కోడిపిల్ల ధరలకు జడిసి గిట్టుబాటు కాదని చాలామంది రైతులు కొత్త బ్యాచ్‌లు వేయలేదు. శ్రావణమాసం అయినప్పటికీ సాధారణ వినియోగం కనిపించింది. జిల్లాలో అవసరమైన కోళ్లు లేకపోవడం, ఇతర ప్రాంతాల నుంచి దిగుమతితో ధర ఎక్కువగా ఉంది.

– బొబ్బా వెంకన్న, బ్రాయిలర్ కోళ్ల రైతు, మండపేట

విశ్వం ప్రధాన రూపశిల్పి విశ్వకర్మ

జయంతి సభలో జేసీ నూపుర్ అజయ్



కలెక్టరేట్‌లో విశ్వకర్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన జేసీ నూపుర్ అజయ్ తదితరులు

అమలాపురం రూరల్: శ్రీవిరాట్ విశ్వకర్మ విశ్వం ప్రధాన రూపశిల్పిగా పేరొందారని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.నూపుర్ అజయ్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక కలెక్టరేట్‌లో శ్రీ విరాట్ విశ్వకర్మ జయంతి సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ విశ్వకర్మ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. విశ్వకర్మ జయంతి వేడుకలను రాష్ట్ర పండగగా అధికారికంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సకల కళలకు ఆదిదేవుడు అధిపతి విశ్వకర్మ అన్నారు. విశ్వకర్మను ఆదర్శంగా తీసుకుని అందరూ సన్మార్గంలో నడవాలన్నారు. సమాజానికి అవసరమైన వివిధ వృత్తులను ఆయన సృష్టించారని ఆమె తెలిపారు. కమ్మరి, వడ్రంగి, స్వర్ణకార, శిల్ప, కంచరి వంటి వివిధ వృత్తులను సృష్టించి సమాజానికి అవసరమైన వస్తువులను తయారు చేసుకునేందుకు ఆయన కృషిచేశారన్నారు.. పనిముట్లు సృష్టించిన మహనీయుడని, కుటీర పరిశ్రమలకు అవసరమైన సాధనాలు కనిపెట్టింది విశ్వకర్మ అన్నా రు. పౌరాణిక ఇంజినీర్‌గా వాస్తు శిల్పిగా పేరు పొందడంతో పాటు కార్మిక వ్యవస్థకు పురుడు పోసింది విశ్వకర్మ అన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్ సత్తిబాబు మాట్లాడుతూ సంప్రదాయ కుల వృత్తిదారులు, హస్త కళాకారులను బలోపేతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి విశ్వకర్మ యోజనకు శ్రీకారం చుట్టిందని తెలిపారు. ఈ పథకంపై గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది, వలంటీర్లు, స్వయం సహాయక సంఘాలు, బ్యాంకర్లకు అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకోవడంతోపాటు లబ్ధిదారులు ఆన్‌లైన్‌లో నమోదుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. 18 రకాల వృత్తి, హస్త కళాకారుల్లో లబ్ధిదారులను గుర్తించాలని, లబ్ధిదారుల నమోదుకు వలంటీర్లు చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ పథకం కింద తొలిదశలో అర్హులైన 18ఏళ్లు నిండిన సంప్రదాయ కుల చేతి వృత్తిదారులను, కళాకారులను గుర్తించాలన్నారు. ఆన్‌లైన్‌లో నమోదు అనంతరం లబ్ధిదారుల వెరిఫికేషన్ చేయాలన్నారు. మొదటి దశలో రూ.లక్ష, రెండవ దశలో రూ.రెండు లక్షల రుణాన్ని 5 శాతం సబ్సిడీ వడ్డీతో అందిస్తారన్నారు. ఈ పథకంలో భాగంగా నైపుణ్య శిక్షణ, పనిముట్లకు సంబంధించి రూ.15 వేలు వరకు ఇన్సెంటివ్ ఇస్తారన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ పరిపాలన అధికారి కాశి విశ్వేశ్వరరావు, విశ్వ బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు తాళాబత్తుల లక్ష్మణరావు, తాళాబత్తుల వెంకటేశ్వరావు, అనుపోజు శ్రీనివాస్, చేబోలు చంద్రశేఖర్, వరద చిన సత్తిబాబు, పట్నాల రమణ, కర్రి శేషగిరి, బాబీ భాస్కర రావు పాల్గొన్నారు.

నేడు స్పందనకు సెలవు

అమలాపురం రూరల్: వినాయక చవితి సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం సెలవును ప్రకటించిన సందర్భంగా అంబేడ్కర్ కోనసీమ జిల్లా కేంద్రం అమలాపురం కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమం నిర్వహించడంలేదని జిల్లా కలెక్టర్ కార్యాలయం అధికారులు ఆదివారం ప్రకటనలో పేర్కొన్నారు. విషయాన్ని జిల్లావ్యాప్తంగా ఉన్న అర్జీదారులు గమనించి సహకరించాలని కలెక్టరేట్ అధికారులు ఆ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

చెత్త సమస్యకు కొత్త పరిష్కారం

- అమలాపురానికి లెగసీ వేస్ట్ ప్రాసెసింగ్ ప్లాంట్
- కరగనున్న 28 వేల మెట్రిక్ టన్నుల చెత్త కొండ
- రూ.2.01 కోట్లతో ఏర్పాటు

అమలాపురం టౌన్: స్థానిక మున్సిపాలిటీ డంపింగ్ యార్డులో కొన్నేళ్లుగా పేరుకుపోయిన 28 వేల మెట్రిక్ టన్నుల చెత్త కొండను కరిగించేందుకు రూ.2.01 కోట్లతో లెగసీ వేస్ట్ ప్రాసెసింగ్ ప్లాంట్‌ను ఎట్టకేలకు నెలకొల్పారు. భవిష్యత్తులో చెత్త సమస్యకు ఈ ప్లాంట్ ద్వారా పూర్తి పరిష్కారం లభించనుంది.

ఏడాది కాల పరిమితితో ఈ ప్లాంట్ ద్వారా మొత్తం చెత్త కొండను నాలుగు రకాల ప్రాసెస్‌తో కరిగించనున్నారు. స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ద్వారా గుంటూరు తరుణి అసోసియేట్స్ సంస్థ ఇక్కడ ఈ ప్లాంట్‌ను నెలకొల్పింది. స్థానిక 29వ వార్డులోని శ్మశాన వాటిక, కంపోస్టు యార్డు ఉన్న స్థలంలోనే ప్లాంట్ ఏర్పాటు చేసి మూడు రోజులుగా చెత్త శుద్ధీకరణ చేస్తోంది. మున్సిపాలిటీకి దాదాపు 15 ఏళ్లుగా గుది బండలా ఉన్న వేల టన్నుల చెత్త కొండ పెను సమస్యగా మారింది. ఇప్పటికే పెరుగుపోతున్న చెత్త కొండను తగ్గించేందుకు మున్సిపాలిటీ అనేకసార్లు పొక్లెయిన్ వినియోగిస్తూ దాదాపు రూ.కోటి వరకూ నిధులు వెచ్చించింది. ఈ క్రమంలో ఇప్పుడు లెగసీ వేస్ట్ ప్రాసెసింగ్ ప్లాంట్ వల్ల ఈ పెను సమస్యకు పరిష్కారాన్ని చూపుతోంది. స్వచ్ఛంధ్ర కార్పొరేషన్ ద్వారా కేంద్ర ప్రభుత్వం 50 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 35 శాతం, మున్సిపాలిటీ 15 శాతం నిధులను భరించి ఈ ప్లాంట్‌ను నడుపుతున్నాయి.

రోజుకు 200 టన్నులు నాలుగు రకాలుగా శుద్ధి

ఈ ప్లాంట్ ద్వారా 28 వేల మెట్రిక్ టన్నుల చెత్తను రోజుకు 200 టన్నుల వంతున శుద్ధి చేసేందుకు ఏర్పాట్లు చేశారు. బయో రెమిడియేషన్ ప్రక్రియతో లెగసీ వేస్ట్ ల్యాండ్ రిక్లమేషన్, బయో మైనింగ్ విధానంతో చెత్త శుద్ధి జరుగుతోంది. ఈ ప్లాంట్‌లో లెగసీ చెత్త వేయగానే ఒకేసారి నాలుగు రకాల చెత్త శుద్ధి, వర్గీకరణ జరుగుతుంది. చెత్తలోని మట్టిని ఓ వైపు వేరు చేస్తుంది. మరో వైపు రాళ్లు, రప్పలను, ఇంకో వైపు గాజు వస్తువులు, మరో వైపు ప్లాస్టిక్ వ్యర్థాలను వేరు చేస్తుంది.

లెగసీ ట్రీట్‌మెంట్ ద్వారా వచ్చే మట్టిని ఎరువుగా ఉపయోగిస్తారు. రాళ్లు, రప్పల ద్వారా వచ్చిన మెటీరియల్‌ను పల్లపు ప్రాంతాలను మెరక చేసేందుకు వినియోగిస్తారు. గాజు వస్తువులు, ప్లాస్టిక్ వస్తువులను శుద్ధి చేసి వేరే అవసరాలకు ఉపయోగించే విశాఖపట్నంలోని జిందాల్ పరిశ్రమకు తరలిస్తారు. ఇలా నాలుగు రకాలుగా రీ సైకిలింగ్ చేసిన మెటీరియల్‌ను తిరిగి ఉపయోగించుకునేలా అందుబాటులోకి తెస్తున్నారు.



అమలాపురం కంపోస్ట్ యార్డ్‌లో ఏర్పాటైన లెగసీ వేస్ట్ ప్రాసెసింగ్ ప్లాంట్

ప్రజలు సహకరించాలి



లెగసీ వేస్ట్ ప్రాసెసింగ్ ప్లాంట్ అమలాపురం మున్సిపాలిటీకి ఓ వరం. ఈ ప్లాంట్ ద్వారా తొలుత 28 వేల మెట్రిక్ టన్నుల చెత్త కొండను లేకుండా చేస్తాం. తర్వాత రెగ్యులర్‌గా వచ్చే చెత్తను ఎప్పటికప్పుడు తడి, పొడి, ప్రమాదకర చెత్తల వర్గీకరణను పూర్తి స్థాయి సాంకేతిక ప్రక్రియతో రీ సైకిలింగ్ చేసేలా ప్రణాళిక తయారు చేశాం. పట్టణ ప్రజలు క్లీన్ ఆంధ్రప్రదేశ్ (క్లాప్), స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ మార్గ దర్శకాలను అనుసరిస్తూ చెత్త శుద్ధీకరణకు సహకరించాలి.

– ఒమ్మి అయ్యప్పనాయుడు, కమిషనర్, అమలాపుం మున్సిపాలటీ

క్లుప్తంగా

భారతీయ సంస్కృతి అమోఘం




ఆటోరిక్షా రన్ చేస్తున్న మెక్సికో బృందం

మామిడికుదురు: భారతీయుల సంస్కృతీ సంప్రదాయాలు అమోఘంగా ఉన్నాయని మెక్సికోకు చెందిన ఆరుగురు సభ్యుల బృందం పేర్కొంది. 14 రోజుల పర్యటనలో భాగంగా బృందం సభ్యులు ఈ నెల 12వ తేదీన సిక్కింలోని గ్యాంగ్‌టక్ చేరుకున్నారు. అక్కడి నుంచి ఆటోరిక్షా రన్ మొదలు పెట్టారు. జైదా, లూయిస్, సునీట, హెక్టర్, రాకేల్, రెనీ బృందం ఆదివారం మామిడికుదురు చేరుకుంది. రెండు ఆటోలను బృందంలోని సభ్యులు స్వయంగా డ్రైవింగ్ చేస్తూ ఎంతో ఉల్లాసంగా, ఉత్సాహంగా సందడి చేశారు. స్థానికులతో కొద్ది సేపు ముచ్చటించారు. వారితో కలిసి ఫొటోలు, వీడియోలు తీసుకున్నారు. ఇక్కడి వాతావరణం, ప్రజల ఆప్యాయతలు తమను ఎంతగానో ఆకట్టుకున్నాయని ఈ సందర్భంగా బృందం సభ్యులు పేర్కొన్నారు. పచ్చని పల్లెసీమలు, ఆహ్లాదకరమైన వాతావరణం తమల్ని మంత్రముగ్ధుల్ని చేశాయన్నారు. 3,200 కిలోమీటర్లు ప్రయాణించి ఆ నెల 24వ తేదీన కేరళలోని కొచ్చికి చేరుకుని స్వదేశం మెక్సికోకు వెళతామన్నారు.

సిద్ధి వినాయకుని పూజకు సర్వం సిద్ధం

- అయినవిల్లిలో చవితి మహోత్సవాలకు ఏర్పాట్లు
- తొమ్మిది రోజులూ ప్రత్యేక క్రతువులు, సాంస్కృతిక కార్యక్రమాలు

అయినవిల్లి: ప్రసిద్ధి చెందిన అయినవిల్లి విఘ్నేశ్వరాలయం చవితి మహోత్సవాలకు సిద్ధం అయింది. చవితి ఉత్సవాల్లో భాగంగా విఘ్నేశ్వరస్వామిని దర్శించడానికి దేశవ్యాప్తంగా అధిక సంఖ్యలో భక్తులు తరలివస్తారు. చవితి సందర్భంగా బత్తాయి, దానిమ్మ, యాపిల్, ద్రాక్ష, మామిడి పండ్ల రసాలతో స్వామివారిని అభిషేకించనున్నారు. ఇందుకు అన్ని ఏర్పాట్లు జరిగాయి. స్వామికి ప్రత్యేక అభిషేకాల అనంతరం లక్ష గరిక పూజ, వివిధ పుష్పాలతో ప్రత్యేక అలంకరణ, హారతులు వంటి విశేష కార్యక్రమాలు ఉంటాయి. తొమ్మిది రోజులు వివిధ అవతారాల్లో స్వామి దర్శనమిస్తారు. చవితి రోజున సుమారు 10 వేల మంది భక్తులు ఈ అభిషేకాలు, పూజల్లో పాల్గొననున్నారు. ఆలయ ప్రాంగణం వెలుపల మంటపంలో మట్టి గణపతిని ప్రతిష్ఠించి తొమ్మిది రోజులు పూజలు నిర్వహిస్తారు. ఇందుకు తగ్గట్టుగా ఆలయ చైర్మన్ గుత్తుల నాగేశ్వరరావు(నాగబాబు), ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు (సతీష్‌రాజు) ఏర్పాట్లు చేశారు. ఆలయ ప్రాంగణం చలువ పందిళ్లతోను, విద్యుత్ దీపాలంకరణతో శోభాయమానంగా సిద్ధమైంది. అయినవిల్లి ఎస్సై ఎస్.నాగేశ్వరరావు ఆధ్వర్యంలో బందోబస్తును పర్యవేక్షిస్తున్నారు.



చవితికి చలువ పందిళ్లతో ముస్తాబైన అయినవిల్లి సిద్ధివినాయక ఆలయం



ప్రత్యేక అలంకరణలో స్వామివారు

ప్రత్యేక పూజలు నిర్వహించే వేళలు

చవితి సందర్భంగా స్వామివారి ఆలయాన్ని తెల్లవారు జామున నాలుగు గంటలకు తెరుస్తారు. అయిదు గంటల నుంచి స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు ప్రారంభమవుతాయి. మధ్యాహ్నం 12 గంటలకు నిత్యగణపతి హోమం, ఒంటి గంటకు స్వామివారికి ప్రత్యేక అలంకరణ, ప్రసాద నివేదన కార్యక్రమాలు ఉంటాయి. మధ్యాహ్నం నాలుగు గంటలకు స్వామివారిని తీరు వీధుల్లో పల్లకీలో ఊరేగిస్తారు. సాయంత్రం ఆరు గంటలకు పంచహారతులు ఇస్తారు.

అన్ని ఏర్పాట్లూ చేశాం

స్వామిని దర్శించడానికి వచ్చే భక్తులకు అన్ని ఏర్పాట్లూ చేశాం. చవితి సందర్భంగా స్వామికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహిస్తాం. తొమ్మిది రోజుల పాటు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశాం.

– ముదునూరి సత్యనారాయణరాజు (సతీష్‌రాజు), ఈఓ, విఘ్నేశ్వరస్వామి దేవస్థానం, అయినవిల్లి

స్వామికి ప్రత్యేక పూజలు

స్వామివారికి చవితి తొమ్మిది రోజులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు ఉంటాయి. ఆలయం తెల్లవారుజామున నాలుగు గంటల నుంచి రాత్రి ఎనిమిది గంటల వరకూ ఆలయం తెరచి ఉంటుంది.

– అయినవిల్లి సూర్యనారాయణమూర్తి, ఆలయ ప్రధానార్చకులు

ముస్తాబైన లక్ష్మీగణపతి

బిక్కవోలు: చెవిలో చెబితే కోరిన కోర్కెలు తీర్చే స్వామిగా భక్తులు విశ్వసించే బిక్కవోలు శ్రీలక్ష్మీగణపతిస్వామి సన్నిధి చవితి వేడుకలకు సిద్ధమైంది. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలను ఆనుకుని ఉన్న ఈ ఆలయం నిత్యం భక్తులతో రద్దీగా ఉంటుంది. 1,100 సంవత్సరాల చరిత్ర కలిగిన ఆలయమిది. ఇక్కడ శ్రీ లక్ష్మీగణపతి స్వామి ఏక శిలా మూర్తిగా దర్శనమిస్తారు. ఈ విగ్రహం తూర్పు చాళుక్యుల కాలం నాటిదని పురావస్తు శాఖ అంచనా వేసింది. అప్పటి రాజులు ప్రత్యేక పూజలు చేసి, స్వామి చెవిలో చెప్పి పనులు ప్రారంభిస్తే అనుకున్నట్టుగా జరిగేవని ప్రతీతి. ఇప్పటికీ అదే సంప్రదాయాన్ని పాటిస్తూ భక్తులు..స్వామి వారి చెవిలో తమ కోర్కెలు చెప్పుకుంటారు. తొమ్మిదో శతాబ్దానికి చెందిన స్వామివారి విగ్రహం కాలక్రమేణా భూస్థాపితమైంది. అనంతరం 19వ శతాబ్దంలో ఈ విగ్రహం పంట పొలాల్లో బహిర్గతమైంది. స్వామివారిని సురక్షిత ప్రాంతానికి తరలించడానికి భక్తులు చేసిన ప్రయత్నం ఫలించకపోవడంతో అక్కడే మందిరం నిర్మించి, పూజలు ప్రారంభించారు.

విస్తృత ఏర్పాట్లు

వినాయక చవితి సందర్భంగా శ్రీ లక్ష్మీ గణపతి ఆలయంలో సోమవారం ఉదయం నుంచి గణపతి నవరాత్ర మహోత్సవాలు నిర్వహించనున్నారు. ఇందుకు విస్తృత ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా ప్రతి రోజూ ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యమూ కలగకుండా ఏఎంసీ మాజీ చైర్మన్ జంగా వీర వెంకట సుబ్బారెడ్డి ఆధ్వర్యాన ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు. ఆలయ ప్రాంగణాన్ని సుందరంగా అలంకరించారు. ఆదివారం రాత్రి దాటాక సోమవారం తెల్లవారు జామున 1.29 గంటలకు తీర్థపు బిందె సేవతో స్వామివారి చవితి ఉత్సవాలు ప్రారంభమవుతాయి. సోమవారం ఉదయం 10.46 గంటలకు అనపర్తి ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యానారాయణరెడ్డి, ఆదిలక్ష్మీ దంపతులు కలశ స్థాపన చేశారు. ఈ నెల 27న మహాన్నదానంతో ఉత్సవాలు పూర్తవుతాయి. ఈ తొమ్మిది రోజులు స్వామివారిని దర్శించుకోవడానికి వచ్చిన భక్తులకు భోజన సదుపాయం కల్పిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు

స్వామి వారి ప్రత్యేకతలు

బిక్కవోలు శ్రీ లక్ష్మీగణపతి స్వామి విగ్రహం 10 అడుగుల పొడవు, 6 అడుగుల వెడల్పున ఉంటుంది. భారీ కాయంతో ఉన్న స్వామివారికి తొండం కుడి వైపునకు తిరిగి ఉండడం ఇక్కడి ప్రత్యేకత. నాగాభరణం, నాగ మొలతాడు, నాగ యజ్ఞోపవీతం, బిళ్ళకట్టు పంచెతో సుఖాశీనులైన స్వామివారు భక్తులకు కన్నుల పండువగా దర్శనమిస్తారు.



బిక్కవోలు లక్ష్మీగణపతి స్వామి



చవితి సందర్భంగా ఆలయం వద్ద అలంకరించిన చలువ పందిళ్లు

ఘనంగా నిర్వహిస్తాం



ఈ ఏడాది భక్తులు వాన,ఎండ తెలియకుండా ఆలయం చుట్టు పక్కల రేకుల షెడ్లు ఏర్పాటు చేశాం. గత ఏడాది కంటే ఈ ఏడాది కూడా వినాయక చవితి ఉత్సావాలు ఘనంగా చేయాలని నిర్ణయించాం. భక్తులు ఎటువంటి ఇబ్బంది కలగకుండా భారీ క్యూ లు ఏర్పాటు చేశాం. దూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు చవితి రోజు మినహా మిగిలిన రోజలలో అన్నదానం ఏర్పాటు చేశాం.

– తమ్మిరెడ్డి నాగశ్రీనివాస్‌రెడ్డి, శ్రీ లక్ష్మీ గణపతి ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్

వారు చోరీ చేశారంటే మొత్తం ఊడ్చేస్తారు

అమలాపురం టౌన్: దొంగలు ఇళ్లలోకి చోరీలకు వెళ్లినప్పుడు బంగారు, వెండి వస్తువులు, నగదు మాత్రమే దోచుకోవడం సాధారణం. అయితే ఈ ఇద్దరు దొంగలు మొత్తం ఊడ్చేస్తారు. అమలాపురంలోని జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఆదివారం మధ్యాహ్నం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఎస్పీ సుసరాపు శ్రీధర్, కొత్తపేట డీఎస్పీ కేవీ రమణ, పి.గన్నవరం సీఐ డి.ప్రశాంత్‌కుమార్ ఈ దొంగల చోరీల చిట్టాను వివరించారు. కాకినాడ జిల్లా కొత్త గైగోలుపాడు శివారు అంబేడ్కర్ కాలనీకి చెందిన పిల్లి సింహాచలం, కాకినాడ రూరల్ మండలం గొందారిగుంటకు చెందిన ముల్కీ మారుతీ శ్రీరామ్ సాయిను అరెస్ట్ చేశారు. వీరితోపాటు వీరు దొంగిలించిన బంగారు నగలను దాయడం, కొనడం వంటి నేరాలకు పాల్పడిన కాకినాడ జిల్లా కిర్లంపూడికి చెందిన వలపుశెట్టి వీరబాబును కూడా అరెస్ట్ చేశారు. వీరిని కొత్తపేట మండలం పలివెల వంతెన సమీపంలో శనివారం అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్పీ శ్రీధర్ తెలిపారు. పిల్లి సింహాచలం మొదట్లో వేరే నేర స్నేహితులతో కలసి చోరీలు చేసేవాడు. ఇటీవల కాలంలో మారుతీ శ్రీసాయి రామ్ కొత్తగా స్నేహితుడు కావడంతో అతనితో కలిసి కొత్తగా చోరీలు చేయడం మొదలు పెట్టాడు. ఈ ఇద్దరు దొంగలు ఈ 2023 సంవత్సరంలోనే అయిదు జిల్లాల్లో 32 చోరీలకు పాల్పడినట్లు దర్యాప్తులో తేలిందని ఎస్పీ శ్రీధర్ పేర్కొన్నారు. కోనసీమ జిల్లాలో 12 చోరీలు, తూర్పుగోదావరిలో 7, కాకినాడ జిల్లాలో 7, పశ్చిమ గోదావరి జిల్లాలో 1, ఏలూరు జిల్లాలో 2, అనకాపల్లి జిల్లాలో 3 చోరీలకు పాల్పడ్డారు. వీరి నుంచి 586.695 గ్రాముల బంగారు నగలు, 4 మోటారు సైకిళ్లు, ఒక కెమెరా, ఒక కెమెరా ఫ్లాష్ లైట్, 4 ఎస్ఈడీ పెద్ద టీవీలు, ఒక హోమ్ థియేటర్, ఒక మ్యూజిక్ గిటార్ స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.37 లక్షలు ఉంటుందని ఎస్పీ వివరించారు. ఎన్నో చోరీలతో సంబంధం ఉన్న ఈ అంతర జిల్లాల దొంగల కేసును త్వరిత గతిన ఛేదించడమే కాకుండా వారి నుంచి సొత్తును రికవరీ చేసిన అధికారులు, సిబ్బందిని ఎస్పీ శ్రీధర్ అభినందించారు.

ముగిసిన రాష్ట్ర స్థాయి అండర్-11 బ్యాడ్మింటన్ పోటీలు

మలికిపురం: జిల్లాలోని మలికిపురంలో మూడు రోజులుగా జరుగుతున్న రాష్ట్ర స్థాయి అండర్-11 బాడ్మింటన్ చాంపియన్ షిప్ పోటీలు ఆదివారంతో ముగిశాయి. గరల్స్ సింగిల్స్‌లో డి.ఆకాశ్రీ (ప్రకాశం జిల్లా) విన్నర్‌గాను, బి.దివ్య (తూర్పుగోదావరి జిల్లా) రన్నర్‌గా నిలిచారు. బాయ్స్ సింగిల్స్ విభాగంలో వైఎస్సార్ రిత్విక్ (విశాఖపట్నం) విన్నర్‌గాను, మహంకాళి జస్వంత్ (కర్నూలు) రన్నర్‌గాను నిలిచారు. గర్ల్స్ డబుల్స్ విభాగంలో డి.ఆకాశ్రీ (గుంటూరు), ఎస్.కావ్య (కృష్ణ) విన్నర్స్‌గాను, బి.దివ్య (తూర్పు గోదావరి) జె.సాహితి (తూర్పు గోదావరి) రన్నర్స్‌గా నిలిచారు. బాయ్స్ డబుల్స్‌లో సుభాష్ కొడెపి(కృష్ణా), మహంకాళి జస్వంత్ (కర్నూలు) విన్నర్స్‌గాను, సీహెచ్ మనీందర్‌రెడ్డి (నెల్లూరు) టి.వర్షిత్ (నెల్లూరు) రన్నర్‌గా నిలిచారు. శ్రీ రామా బాడ్మింటన్ అకాడమీ, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, ఈస్ట్ గోదావరి బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ పోటీలు జరిగాయి.

